క్లుప్తంగా

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం



నకరికల్లు: ఇంటింటికీ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డెప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్ సూచించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా సచివాలయంలో సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 గాంధీ జయంతి పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వర్లు, బత్తిన శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన ఏళ్ల నాటి చెట్టు



అమరావతి: అమరావతి– గుంటూరు రహదారిలో సోమవారం ఉదయం ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో రోడ్డు పక్కన ఎన్నో ఏళ్లనాటి చింతచెట్టు మొదలు కుళ్లి అడ్డంగా కూలిపోయింది. గుంటూరు–అమరావతి రోడ్డులో ప్రయాణించే వాహనాలకు సుమారు గంట పాటు అంతరాయం ఏర్పడింది. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు సీఐ అచ్చియ్యకు సమాచారం ఇవ్వటంతో పొక్లయిన్ సాయంతో చింతచెట్టును పక్కకు నెట్టారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి

సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేయడానికే..



సత్తెనపల్లి: సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయడానికే వేడుకలు నిర్వహిస్తున్నట్లు భాష్యం జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.హృదయ్‌రాజ్ చెప్పారు. పట్టణంలోని భాష్యం పాఠశాలలో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులంతా అమ్మవారి వేషధారణలో, తల్లులు అంతా బతుకమ్మను మోసుకొచ్చి పాఠశాల ప్రాంగణంలో కోలాటం నిర్వహించారు. హృదయ్‌రాజ్ మాట్లాడుతూ చెడుపై మంచి గెలవడమే విజయదశమి పండుగ ప్రత్యేకత అని విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటరావు విద్యార్థులకు పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో చాంప్స్ హెచ్ఎం వి.భార్గవి, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చినపసుమర్రు గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భావన ఋషినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ వింజమూరి ఆదినారాయణ సోమవారం సాయంత్రం జాతీయ రహదారి గొర్రెలమండి సమీపంలోని పొలాల్లో ఓ వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆదినారాయణ బలవన్మరణం చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో భావన ఋషినగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

నిత్యావసర సరుకులు పంపిణీ

నూజెండ్ల: వరద నీరు ముంచెత్తి ఇబ్బందుల పడుతున్న కమ్మవారిపాలెం యానాదికాలనీని మండల అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ పి. ఉమాదేవి పొక్లయినర్ సాయంతో కాలువ తీయించి వరద నీటిని మళ్లించే ఏర్పాటు చేయించారు. ఆరోగ్యశాఖ వారు అంటువ్యాధులు ప్రబలకుండా మురుగు కాల్వల్లో బ్లీచింగ్ చల్లించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కాలనీ వాసులకు తహసీల్దార్ రమేష్‌కుమార్ సుమారు 50 కుటుంబాలకు గాను ఒక్కొక్క కుటుంబానికి 5 కేజీల బియ్యం, కందిపప్పు, స్థానిక ఎంఎల్‌ఎ జి.వి.ఆంజనేయులు ఇచ్చిన దుప్పట్లు, కూరగాయలు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆధార్ లేని వారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామన్నారు.
గ్రామ నాయకులు గంగినేని బాబు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ సహకారంతో ప్రభుత్వం తరఫున అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి నివేశన స్థలాలు మంజూరు చేయించటంతో పాటు పక్కా గృహాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

జయ చిద్రూపి

- దసరా శరన్నవరాత్రులు ప్రారంభం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: దసరా విజయానికి సంకేతం. హిందూ ధర్మంలో శక్తిస్వరూపిణిగా కొలిచే అమ్మవారి నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా, ఇతర అలంకారాల్లో దర్శనమిచ్చారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తజన సందడితో కళకళలాడాయి. జయచిద్రూపి అంటూ అమ్మవారిని స్తుతిస్తూ భక్తులు అమ్మవారి దర్శనం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయాల్లో క్యూలు ఆధ్యాత్మిక తరంగాల్లో కనిపించాయి. వివిధ ప్రాంతాల్లో చలువ పందిళ్లలో కొలువుదీరిన అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు ఆ రూపాన్ని మదిలో తలచుకుంటూ ఇళ్లకు వెనుదిరిగారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
క్రోసూరు: క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అమ్మవారికి వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మ ఆటపాటలు జరిగాయి.
నకరికల్లు: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేజర్లలోని కపోతేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశర్మ, నర్సింగపాడులోని మరకతలింగచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.
బెల్లంకొండ: బెల్లంకొండ గ్రామంలో శ్రీ మహాలక్ష్మీదేవీ నిలయంలోని పీఠంలో ఉత్సవాలు మొదలయ్యాయి. శతాధిక ప్రతిష్ఠాచార్యులు పులుపుల వేంకట ఫణికుమార శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు.
ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలోని శ్రీపైడమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.
అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజారి గుంటూరు సురేష్‌ఆచార్యులు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సత్తెనపల్లిలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో వాసవీమాత



క్రోసూరులో వాసవీకన్యకాపరమేశ్వరి



సత్తెనపల్లి.. వడ్డవల్లి పెద్దబొడ్డురాయి వద్ద బాలాత్రిపురసుందరీదేవి



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ..



చాగంటివారిపాలెంలో శ్రీబాలాత్రిపురసుందరిగా



బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో నర్సింగపాడులోని అమ్మవారు



వెంకటాయపాలెంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సత్తెనపల్లి.. పెదమక్కెనలో వనబాలాదేవి

దాడి కేసు నమోదు

ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలోని పల్నాడు వైన్స్‌లో యువకుడిపై దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు సోమవారం తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన కొణిదెల శివప్రసాదరావును స్థానికులు అన్నపురెడ్డి మహేశ్వరరెడ్డి, పఠాన్ చాంద్‌బాషా, బొరిగర్ల నాగరాజు, మధిర కృష్ణారెడ్డి, బత్తుల వేణు లతో పాటుగా మరో ఇద్దరు యువకులు మద్యం దుకాణం వద్దకు పిలిపించి దాడి చేసి గాయపరిచారు. గ్రామంలో జరిగిన దొంగతనంపై వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన శివప్రసాదరావును సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో మహేశ్వరరెడ్డి, పఠాన్ చాంద్‌బాషాలు గుంటూరు, నరసరావుపేట పోలీస్‌స్టేషన్లలో నమోదైన గంజాయి కేసుల్లో నిందితులు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. తాడికొండ మండలం దామరపల్లికి చెందిన మందడపు శివనాగేశ్వరరావు (49) మూడేళ్లుగా పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలో నివసిస్తున్నాడు. ఈ నెల 19న సైకిల్‌పై సెంటర్‌కు రాగా పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఎదురు ప్రధాన రహదారిపై మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. శివనాగేశ్వరరావు ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివనాగేశ్వరరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పోషణ్'ను వినియోగించుకోవాలి

క్రోసూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పోషణ్ మహా మాసోత్సవాలను మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు వినియోగించుకోవాలని ఆయా గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు తెలిపారు. సోమవారం మండలంలోని క్రోసూరులోని 5,6,8,3, బయ్యవరం లోని 1,2,3,4 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మహా మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుతో భూమికి మేలు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటలను సాగు చేస్తే భూమి ఆరోగ్యంగా ఉండడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపాలెంలో బయో రీసెర్చ్ సెంటర్లో ఉత్పత్తులను హైదరాబాద్ వాలంతరీ ఆర్గనైజర్ సంస్థ డైరెక్టర్ కె. విజయ గౌరీతో కలసి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న రైతుల పొలాలను సందర్శించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పాటించాలని, రసాయనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వాలంతరీ ఆర్గనైజర్ ఏవో అన్నపూర్ణ, ఎంటీఎల్ పవన్ కుమార్, ఎంటీ అనంతలక్ష్మి, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, తదితరులు

సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు

సత్తెనపల్లి: సమాజంలో కన్యాశుల్కాన్ని రూపుమాపిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని కొనియాడారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శాలివాహననగర్‌లో సోమవారం గురజాడ జయంతి సభ జరిగింది. సభకు సీఐటీయూ నాయకుడు ఎం.హరిపోతురాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఐద్వా ఉపాధ్యక్షురాలు విమల గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజని మాట్లాడుతూ గురజాడ మహిళలను చైతన్యవంతులను చేసి ఉద్యమించారన్నారు. కన్యాశుల్కానికి వ్యతిరేకంగా ఆనాడు గురజాడ ఉద్యమించి ఆ దురాచారాన్ని రూపుమాపారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి.అమూల్య మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. అంటే ఆనాడు సంఘ సంస్కర్తలు రూపుమాపిన దురాచారాలను మళ్లీ ఈ రోజు సమాజంపై రుద్దడమేనని విమర్శించారు. సభలో 5వ పట్టణ కార్యదర్శి కె.సుధారాణి,కమిటీ సభ్యులు ఎం.రమాకుమారి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



శాలివాహననగర్‌లో గురజాడకు నివాళులర్పిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రజని

ఓటు.. అందరి హక్కు

- ఎస్ఐఆర్ పేరుతో బిహార్ లో 64 లక్షల ఓటర్లను తొలగించడం దుర్మార్గం
- సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్

సత్తెనపల్లి: మైనార్టీ తీరిన ప్రతి ఒక్కరికి ఓటు ఒక హక్కు అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని శాలివాహననగర్‌లో సోమవారం జరిగిన అధ్యయన వేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తలొగ్గి స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బిహార్‌లో 64 లక్షల ఓటర్లను తొలగించడం దుర్మార్గమన్నారు. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుందన్నారు. 12 ఏళ్ల కాలంలో ప్రజల హక్కులను కాలరాసే చర్యలు తప్ప ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. బతికి ఉన్న వారి ఓటర్లను తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సిగ్గుచేటన్నారు. ఒకవైపు సుప్రీంకోర్టు మొట్టి కాయలు వేస్తున్నా లెక్కచేయకుండా ఎలక్షన్ కమిషన్ ఓట్లను తొలగించే కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కోటసాయి, సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, 17వ వార్డు శాఖ కార్యదర్శి ఎం హరిపోతురాజు, సభ్యులు ఎం రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.



అధ్యయన వేదికలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్య దర్శి గుంటూరు విజయ్‌కుమార్

సైన్స్‌లో విద్యార్థుల సృజనాత్మకత

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పెదనందిపాడు మార్గంలో ఉన్న సెయింట్ చార్లెస్ ఐసీఎస్ఈ పాఠశాలలో సోమవారం సైన్స్ ఎక్స్‌పో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన పలురకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. చిన్నారులు రూపొందించిన ప్రయోగాలను, అతిథులకు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ప్రతిభను, ప్రయోగాలను చూసి వారంతా అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్సీఎంచర్చి ఫాదర్ పూదోట థామస్ స్టాటస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎస్ బాలసారి, మదర్ సుపీరియర్ శాంత, పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరాలను వినియోగించుకోండి

ఆవులవారిపాలెం(క్రోసూరు): మహిళలు స్వస్థ నారీ వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు సిరిచందన అన్నారు. ఆవులవారిపాలెంలో సోమవారం స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం పీహెచ్‌సీ వైద్యురాలు సిరిచందన ఆధ్వర్యాన ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో మహిళలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, రక్తహీనత, ఎనీమియా పరీక్షలు, సికిల్ సెల్ పరీక్షలు, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, కౌమార దశలో బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ శిబిరంలో ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల శ్రీనివాసరావు, నేతలు పిల్లా నర్సయ్య, బదమ్మాలపాటి శ్రీనివాసరావు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

72 మందికి వైద్యసేవలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం సోమవారం జరిగింది. శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి పరిశీలించి పలు సూచనలు చేశారు. వైద్యులు రమాదేవి, జయకృష్ణప్రవీణ్ పాల్గొని 72 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

నరసరావుపేట ఈస్ట్: కార్మిక లోకానికి తీవ్ర నష్టాన్ని కలిగించే లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌లో 2020 సెప్టెంబర్ 22వ తేదీన లేబర్‌కోడ్‌లను ఆమోదించిన రోజును పురస్కరించుకుని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల సభ్యులు వాకౌట్‌లో ఉండగా, కేంద్ర బీజేపీ ప్రభుత్వం హడావుడిగా లేబర్ కోడ్‌లను ఆమోదించటం అప్రజాస్వామికమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, షేక్. జాన్‌చిన సైదా తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

క్రోసూరు: పంచాయతీలు ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు ఎలా పెంచుకోవాలో అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం క్రోసూరు మండలపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా రిసోర్సు పర్సన్లుగా పంచాయతీ కార్యదర్శులు పీసపాడు పీఎస్ ఉమామహేశ్వరరావు, 88త్యాళ్లూరు పీఎస్ శిరీష, క్రోసూరు 2 పీఎస్ కోటేశ్వరరావులు వ్యవహరించారు. శిక్షకులు మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయ వనరులు ఏవిధంగా పెంపొందించాలి, పన్నుల వసూళ్లు, ఇంటి పన్ను, వృత్తిపన్ను, ఆస్తుల బదిలీ పన్నుల్లో వాటా, భూమి శిస్తులో వాటా, దుకాణాలపై పన్ను, జంతువులపై పన్ను, ప్రకటనలపై పన్ను, విశ్రాంతి భవనాలు, ఖాళీస్థలాలు, మార్కెట్లపై వచ్చే అదాయ వనరులపై తప్పని సరిగా దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి విరాళాలు, ట్రస్టుల ద్వారా విరాళాలు సేకరించుకోవచ్చన్నారు. స్థిరాస్తి అభివృద్ధికి రుణాలు తీసుకుని ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి తాలుకా న్యాయస్థానం ప్రాంగణంలో నిరసన తెలిపారు.రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన 10/25 సర్క్యులర్‌తో గతంలో ఏదైనా బార్ అసోసియేషన్ ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది మరణిస్తే అక్కడ న్యాయస్థానంలో ఉదయం 10.30 గంటలకు సంతాప సమావేశం నిర్వహిస్తారన్నారు. కానీ ఈ సర్క్యులర్‌లో సాయంత్రం 4.15 గంటలకు నిర్వహించుకోవాలని జారీ చేయడంతో ఆ లక్ష్యం నెరవేరదన్నారు. ఎక్కువ మంది న్యాయవాదులు ఆ సమయంలో హాజరు కాలేరని, కనీసం సహచర న్యాయవాదికి సంతాప సందేశం ఇవ్వలేరన్నారు. వారి వృత్తి విలువలు జూనియర్ న్యాయవాదులకు తెలిసే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. న్యాయవాద వర్గాలకు ఇబ్బందికరమైన సర్క్యులర్ నంబర్ 10/25ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, అసోసియేషన్ బాధ్యుడు షేక్ జానీభాజావలి, న్యాయవాదులు అంకాళ్ళ వెంకటేశ్వర్లు, దివ్వెల శ్రీనివాసరావు, సందెపోగు బాబురావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, ఇ.ఏడుకొండలు, ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అప్రకటిత విద్యుత్ కోతలు!

నకరికల్లు ప్రజల ఇక్కట్లు

నకరికల్లు: అప్రకటిత విద్యుత్‌కోతతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపాటి గాలి వీచినా వర్షం కురిసినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. రెండోశనివారం అధికారిక మరమ్మతులంటూ సమయం ప్రకటించిన దానికంటే గంటల తరబడి ఆలస్యం చేస్తూ విసుగెత్తిస్తున్నారు. రాత్రనక, పగలనక కోతలు పరిపాటిగా మారాయి. విద్యుత్ బిల్లులు పెంచబోమని.. విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వబోమని ఎన్నికలకు ముందు మాటఇచ్చిన కూటమి ప్రభుత్వం మాటతప్పడంతో వినియోగదారులు అవస్థ పడుతున్నారు. మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల, చేజర్ల, గుండ్లపల్లి, కండ్లకుంట గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మండలంలో సుమారు 16,741 గృహ కనెక్షన్‌లు, 4వేలకు పైగా వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నాయి. వ్యవసాయానికి, పరిశ్రమలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. బిల్లుల మోత మోగించడంతో పాటు ఒక్కనెల బిల్లు చెల్లించడం ఆలస్యమైనా అదనపు రుసుం వసూలు చేయడం చేసే విద్యుత్‌శాఖ నాణ్యమైన విద్యుత్ సరఫరాలో వైఫల్యం చెందుతుంది.

నిత్యం కోతలే

గృహ అవసరాలకు ఇచ్చే విద్యుత్‌తో అటు వ్యవసాయ అవసరాలకు ఇచ్చే విద్యుత్‌లోను కోతలు విధిస్తున్నారు. వర్షాకాలం కావడంతో అసలే సీజనల్‌వ్యాధులతో అల్లాడిపోతున్న ప్రజలకు దోమలబెడద పట్టి పీడిస్తుంది. ప్రతినెలా రెండోశనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్‌కోతలను ముందుగా ప్రకటిస్తారు. ఆరోజు సాయంత్రం వరకు కూడా కరెంట్ సరఫరా ఇవ్వడం లేదు. దీనికితోడు ఎల్‌సీ అంటూ ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్ అంటూ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల ఏర్పాటు అంటూ విద్యుత్ కోతల మయంగా మారింది.
అదనపులోడు కారణంగా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని అధికారులు చెబుతున్నా, ముందస్తు ఏర్పాట్ల విషయంలో విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.



నకరికల్లులోని విద్యుత్ ఉపకేంద్రం